



భీమునిగుమ్మం అన్న క్యాంటీన్ ఆవరణను శుభ్రం చేస్తున్న కార్మికులు



బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

ఉక్కపోతతో విలవిల

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికం
- అల్లాడిపోయిన జనం

అనకాపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతు పవనాలు ప్రవేశించినా జిల్లాలో ఎండ తీవ్రత మాత్రం తగ్గడం లేదు. పలు మండలాల్లో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనం ఉక్కపోతతో అల్లాడిపోయారు. పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వృద్ధులు, చిన్నా రులు ఇబ్బందులు పడ్డారు. కాగా తెలంగాణ నుంచి బంగాళా ఖాతం మధ్య ప్రాంతాల వరకు ద్రోణి కొనసాగుతున్నందున రాగల 24 గంటల్లో జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఉరుములతో కూడిన వర్షం పడిన సందర్భంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదని సూచించారు.

సాగునీటి కష్టాలు తీరేనా?

రైవాడ సాగునీటి కాలువల అభివృద్ధిపై అంతులేని నిర్లక్ష్యం

- పూడుకుపోయి చుక్కనీరు ఇవ్వని కాలువలు
- సుమారు నాలుగు వేల ఎకరాలకు నీరందని దుస్థితి
- పట్టించుకోని జల వనరుల శాఖ అధికారులు
- కూటమి అధికారంలోకి రావడంతో సమస్య పరిష్కారం అవుతుందని రైతుల్లో నమ్మకం



మండలంలోని రేవళ్ల వద్ద వృథాగా ఉన్న కాలువ

చోడవరం, జూన్ 19:

రైవాడ రిజర్వాయర్ సాగునీటి కాలువలపై జల వనరుల శాఖ నిర్లక్ష్యం మండల పరిధిలోని రైతాంగానికి శాపంగా మారింది. సాగునీటి కాలువల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలోని సుమారు నాలుగు వేల ఎకరాల పంట భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో తమ కష్టాలు తీరతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



గవరవరం సమీపంలో పూడుకుపోయిన రైవాడ కుడి కాలువ

రైవాడ కుడి కాలువ చివరి భూములకు సాగునీరు అందించాలంటూ చాలా కాలంగా రైతాంగం ఉన్నతాధికారులు, జలవనరుల శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కొరవడింది. ఫలితంగా నాలుగు వేల ఎకరాల పంట భూములకు సాగునీరు అందని దుస్థితి కొనసాగుతోంది. మండల పరిధిలోని లక్కవరం, జుత్తాడ, చోడవరం, ఖండేపల్లి, గవరవరం, సింహాద్రిపురం పంచాయతీలలోని పంట భూములకు రైవాడ నీరే ఆధారం. పేరుకు ఈ నాలు వేల ఎకరాలు రైవాడ కుడి కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్నాయని చెప్పుకోవడం తప్పితే, ఆది నుంచీ ఈ కాలువల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏటా సాగునీరు కోసం ఈ ప్రాంత రైతాంగం వర్షాలపైనే ఆధారపడడం మినహా మరేమీ చేయలేకపోతున్నారు.

రైతుల గోడు పట్టించుకునే వారేరీ?

రైవాడ కుడి కాలువ కింద మండలంలోని రేవళ్లు, లక్కవరం, జుత్తాడ, చోడవరం చానల్స్ ఉన్నాయి. ఈ చానల్స్ పరిధిలోనే గవరవరం, జుత్తాడ, ల క్కవరం, ఖండేపల్లి, సింహాద్రిపురం, చోడవరం పంచాయతీలోని శివారు రేవళ్లు, చోడవరం గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల ఎకరాల పంట భూములు ఉన్నాయి. రైవాడ రిజర్వాయర్ నుంచి విడుదలయ్యే సాగునీరు కుడి కాలువల ద్వారా సజావుగా పారితే ఈ చానల్స్ పరిధిలో ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. కానీ ఈ చానల్స్‌కు నీరు అందే దేవరాపల్లి మండలం బోయిలకింతాడ వద్ద ఉన్న మెయిన్ కెనాల్ పరిధిలో శారదానదిలో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నది క్రమంగా లోతుగా ... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి



రైవాడ కుడి కాలువ కింద ఆయకట్టు పరిధిలోని ఈ భూములకు సాగునీరు శాశ్వత ప్రాతిపదికన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శారదా నదిపై దేవరాపల్లి మండలం కలిగొట్ల వద్ద ఆనకట్ట నిర్మించడంతో పాటు లక్కవరం వద్ద జుత్తాడ చానల్‌కు ప్రత్యేకంగా గ్రోయిన్ నిర్మించాలి. ఇవి చేయడంతో పాటు పూడుకుపోయిన సాగునీటి కాలువలు బాగు చేస్తే ఆయకట్టు పరిధిలోని నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ సమస్యపైనే ఏటా ఆందోళనలు చేస్తున్నాం. అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నాం. గత ఏడాది ఆందోళన చేస్తే జలవనరుల శాఖ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు తప్పితే ఏమాత్రం స్పందన లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైవాడ నీరు పంట పొలాలకు అందించి రైతులను ఆదుకోవాలి.

- కోన మోహనరావు, జిల్లా రైతు కూలీ సంఘం కార్యదర్శి

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు

భవనాల ఆధునికీకరణకు రూ.30.5 లక్షలతో ప్రతిపాదనలు

అనకాపల్లి టౌన్, జూన్ 19: అనకాపల్లిలో రెండు చోట్ల అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు చర్యలు ప్రారంభించారు. గతంలో ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణ, భీమునిగుమ్మం జంక్షన్‌లోని రైల్వేస్టేషన్ వద్ద 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసి కేవలం రూ.5లకే పేదల ఆకలి తీర్చింది. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్లను మూసివేయడంతో అప్పటి నుంచి భవనాలు ఖాళీగా ఉన్నాయి. ఈ ఒక్కొక్క క్యాంటీన్‌లో అప్పట్లో రోజుకు వెయ్యి మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లను నిలిపివేయడంతో ప్రజలు అసంతృప్తికి గురయ్యారు. కాగా ఎన్టీఆర్ వైద్యాలయంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనంలో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌ను



ఎన్టీఆర్ వైద్యాలయంలో అన్న క్యాంటీన్‌కు కేటాయించిన భవనం

ఏర్పాటు చేసి కోవిడ్ సమయంలో పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ల్యాబ్ నిరుపయోగంగా మారింది. అయితే విలువైన పరికరాలు ఉండడంతో ఆ భవనాన్ని అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కేటాయించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాత అన్న క్యాంటీన్‌కు సమీపంలో ఉన్న ఒక భవనాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ కేటాయించారు. ఈ భవనాన్ని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు పరిశీలించి భవనం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భీమునిగుమ్మంలోని రైల్వేస్టేషన్ వద్ద అధ్వానంగా మారిన పాత అన్న క్యాంటీన్ భవనం, పరిసరాలను జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు సిబ్బందితో బుధవారం శుభ్రం చేయించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో కేటాయించిన భవనాన్ని ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రూ.19.5 లక్షలు, భీమునిగుమ్మంలో అధ్వానంగా మారిన భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.11 లక్షలతో అంచనాలు తయారుచేసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్టు జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు బుధవారం తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే పనులు ప్రారంభించి అతి కొద్ది రోజుల్లో అన్న క్యాంటీన్ల భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు.

ఆ వలంటీర్లకు అవకాశం లేనట్టే!

జిల్లాలో 5,235 మంది ఔట్

- మిగిలింది 2,904 మంది మాత్రమే..
- రాజీనామా చేసినవారిని తిరిగి కొనసాగించేందుకు అభ్యంతరాలు
- మండలాల వారీగా వలంటీర్ల వివరాలు సేకరిస్తున్న యంత్రాంగం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో వైసీపీ కోసం పనిచేసేందుకు రాజీనామా చేసిన గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్ల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. జిల్లాలో 24 మండలాల పరిధిలో ఎన్నికల ముందు రాజీనామాలు చేసిన 5,235 మందిని తిరిగి కొనసాగించే అవకాశం లేదని తెలిసింది. దీంతో గతంలో ముందూ వెనుక ఆలోచించకుండా వైసీపీ జెండా పట్టుకొని తిరిగిన కొందరు వలంటీర్ల పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడిన ఎలుకలా తయారైంది.



గొలుగొండలో పోలింగ్ బూత్ వద్ద వైసీపీ శిబిరంలో స్లిప్పులు అందించే పనిలో ఉన్న వలంటీర్లు (ఫైల్ ఫొటో)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తరువాత వలంటీర్ల వ్యవస్థపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రస్తుతం వలంటీర్లు ఎంత మంది ఉన్నారు?, గతంలో ఎవరెవరు రాజీనామా చేశారు?, ఇంకా భర్తీ చేయాల్సిన వలంటీర్ల ఖాళీలు ఎన్ని అనే వివరాలు సేకరిస్తోంది. రెండు, మూడు రోజుల్లో వలంటీర్ల వ్యవస్థపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోబోమని, రాజీనామా చేయకుండా కొనసాగిన వలంటీర్లను మాత్రమే కొనసాగించి పని చేయించుకుంటామని ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే ప్రకటించారు. దీంతో జిల్లాలో వలంటీర్ల వివరాల సేకరణలో యంత్రాంగం మండల స్థాయిలో వివరాలు సేకరిస్తోంది.

రాజీనామా చేసిన వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరం

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో గతంలో రాజీనామా చేసిన వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఎన్నికల ముందు తమను బెదిరింపులతో రాజీనామాలు చేయించారని, తమను కొనసాగించాలంటూ కొందరు వలంటీర్లు స్థానిక ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వెల్లబుచ్చుకున్నా, నేతలు ససేమిరా అంటున్నారు. కొందరు వలంటీర్లు రాజీనామాల ముసుగులో వైసీపీ జెండాలు పట్టుకొని కార్యకర్తల్లా వ్యవహరించడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ పక్షాన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కొందరైతే రాజీనామాలు చేసి ఏకంగా వైసీపీకి పోలింగ్ ఏజెంట్లుగా వెళ్లారు. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 24 మండలాల్లోని 522 సచివాలయాల పరిధిలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉండాల్సి ఉండగా 8,139 మందిని గతంలో వైసీపీ ప్రభుత్వం నియమించింది. వీరిలో ఎన్నికల ముందు 5,235 మంది రాజీనామా చేశారు. ఇంకా 2,904 మంది మాత్రమే కొనసాగుతున్నారు. గతంలో రాజీనామా చేయని వలంటీర్లను మాత్రమే కొనసాగించి, ఖాళీలను తిరిగి భర్తీ చేయనున్నట్టు అధికార వర్గాల సమాచారం.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

డైట్ చార్ట్ పాటించని కేజీహెచ్ కాంట్రాక్టర్

- ప్రతి రోజూ టిఫిన్‌గా జావ లాంటి ఉప్మాయే
- భోజనం రుచి కూడా అంతంత మాత్రమే
- వైసీపీ నేత మనుషులకు కాంట్రాక్టు
- నాణ్యతపై ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజలకు పెద్ద దిక్కు అయిన కింగ్‌జార్జి ఆస్పత్రిలో రోగుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి పౌష్టికాహారం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నాయి. వాటిని కాజేయడానికి రాయలసీమ వైసీపీ నేతలు విశాఖలో పాగా వేశారు. ఆ పార్టీ పేరు 'చెవి'న పడగానే ఎటువంటి కాంట్రాక్ట్ అయినా సంతకం చేసేసే అధికారి...దీనిని కూడా అలాగే ఇచ్చేశారు. దాంతో రోగులకు సరైన ఆహారం అందడం లేదు.



రోగులకు అల్పాహారం వడ్డిస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) ప్లేటులో పల్చగా ఉన్న ఉప్మా

కింగ్ జార్జి ఆస్పత్రిలో రోజుకు 1,600 నుంచి 1,800 రోగులకు ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం అందిస్తారు. డాక్టర్లు, పీజీలకు కూడా ఇక్కడే మధ్యాహ్నం భోజనం పెడతారు. వీరు 200 మంది వరకు ఉంటారు. అంటే కేజీహెచ్‌లో రోజుకు రెండు వేల మందికి ఆహారం పెడతారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఏమి పెట్టాలనేది వైద్యాధికారులు ఒక చార్ట్ (మెనూ) తయారుచేశారు. ఆ ప్రకారం ఏ రోజుకు ఆరోజు ఆహారం మారుస్తూ పెట్టాలి. సాధారణ వార్డులో ఉన్న ఒక్కో రోగికి ఆహారం నిమిత్తం ప్రభుత్వం రోజుకు రూ.80 ఇస్తోంది. అదే మహిళలు ఉండే వార్డు (గర్భిణులు, పురుడు పోసుకున్న తల్లులు)లకైతే రోజుకు రూ.100 ఇస్తారు. జననీ శిశు సురక్ష పథకం కింద ఈ నిధులు వస్తాయి. రోజుకు సుమారు రూ.2 లక్షల బిల్లు, నెలకు రూ.60 లక్షలు, ఏడాదికి రూ.7.2 కోట్ల బిల్లు వచ్చే కాంట్రాక్టు కావడంతో చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేత కన్ను పడింది. కలెక్టరేట్‌లో కాలు పెట్టారు. ఉన్నతాధికారి సంతకం చేయడంతో రెండేళ్లకు డైట్ కాంట్రాక్టు దక్కించుకున్నారు. దానిని నలుగురు అనుచరులకు పంచిపెట్టారు. ఆరు నెలలకు ఒకరు చొప్పున డైట్ కాంట్రాక్ట్ తీసుకొని ఆహారం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైకు చెందిన ఒక వ్యక్తి డైట్ అందిస్తున్నారు. ఇందులో భారీగా లాభం కళ్ల చూడాలనే ఆశతో రోగులకు ... మిగతా 6వ పేజీలో

హోం మంత్రి అనిత బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర హోం శాఖా మంత్రిగా వంగలపూడి అనిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతిలో బాధ్యతలు చేపట్టిన ఆమె తనను ఆశీర్వదించిన పాయకరావుపేట ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు కూటమి నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వంగలపూడి అనిత

దడ పుట్టించే దారి

- గోతులమయంగా నర్సీపట్నం- చింతపల్లి రోడ్డు
- రాకపోకలకు వాహనచోదకుల ఇబ్బందులు
- ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు

నర్సీపట్నం, జూన్ 19: స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని పాత కల్పనా థియేటర్ సమీపంలోని మెయిన్ రోడ్డు అధ్వానం తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం పడినప్పుడు గోతుల్లో నీరు చేరి ప్రమాదాలకు గురవుతున్నారు. పాత కల్పనా థియేటర్ సమీపంలోని మెయిన్ రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, అయ్యన్న కాలనీ, నీలంపేట, గబ్బాడ, రావణాపల్లి, ఏటి గైరం పేట ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలోనే ... మిగతా 6వ పేజీలో



గోతులమయంగా ఉన్న నర్సీపట్నం- చింతపల్లి రోడ్డు(ఫైల్)

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

చింతపల్లి, జూన్ 19: నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలోని పెద్దగెడ్డ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన విద్యార్థిని మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పులిగొంది గ్రామంలో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన గిరిజన మహిళ స్వప్న అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గంధాలవీధి గ్రామానికి చెందిన మర్రి లోవకుమారి (17), మరో యువకుడు సిందెరి చందు కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పెద్దగెడ్డ వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ (పశుసంచార వాహనం), ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న లోవకుమారి రహదారిపై పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. లోవకుమారి అరకులోయ గిరిజన సంక్షేమ శాఖ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతున్నది. కాగా వాహనం నడుపుతున్న చందుకు ఎటువంటి గాయాలు తగలలేదు.

36 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

జి.మాడుగుల, జూన్ 19: మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి కూడలి వద్ద బుధవారం 36 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటు నుంచి వస్తున్నవ్యాన్‌లో రెండు గోనె సంచుల్లో 36 కిలోల ఎండు గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌ను సీజ్ చేసి, అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన గోకాడ వరహామూర్తి, డోకాల అప్పా రావు, పెదలోచలి పంచాయతీకి చెందిన కోడ రామకృష్ణకు అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

పవన్‌కల్యాణ్‌కు పంచకర్ల అభినందనలు


పవన్‌తో పంచకర్ల

పెందుర్తి, జూన్ 19 : ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూచే చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

అయ్యన్నపై అభిమానం... అప్పన్నపై భక్తితో పాదయాత్ర


అప్పన్న ఆలయంలో నాతవరం నుంచి వచ్చిన టీడీపీ అభిమానులు

సింహాచలం, జూన్ 19 : ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహ స్వామిపై అచంచల భక్తి, తమ నాయకుడు అయ్యన్నపాత్రుడిపై వల్లమాలిన అభిమానంతో నాతవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు సింహగిరికి పాదయాత్రగా చేరుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన వీరాభిమానులు సుమారు 30 మంది ఈనెల 17న ఉదయం తమ గ్రామం నుంచి పాదయాత్రగా బుధవారం సాయంత్రం సింహగిరికి చేరుకున్నారు. వారంతా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమ స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.

రామ్మోహన్‌నాయుడు దృష్టికి సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు


కేంద్ర మంత్రికి రామ్మోహన్‌నాయుడుకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు

విశాఖపట్నం, జూన్ 19: తెలుగుదేశం పార్టీ నాయకుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఉత్తరాంధ్ర గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం వార్డు సచివాలయ అడ్మిన్ స్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను కేంద్ర మంత్రికి విన్నవించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా రామోహన్‌నాయుడు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. సచివాలయ వ్యవస్థపై కమిటీ వేసి వచ్చిన నివేదిక మేరకు సమీక్ష జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకట గణేష్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్రిష్ణమయ్య చరిత్రను తెరకెక్కిస్తా

» సినీ దర్శకుడు వి.సముద్ర


సినీ దర్శకులు వి సముద్ర

సింహాచలం, జూన్ 19: వరాహలక్ష్మీనృసింహస్వామిపై తెలుగులో నాలుగున్నర లక్షలకుపైగా వచన సంకీర్తనలు రాసి, స్వయంగా బాణీలు సమకూర్చి ఆలపించిన తొలి తెలుగు వచన సంకీర్తనాచార్యులు కాంతా కృష్ణమాచార్యులు (క్రిష్ణమయ్య) చరిత్రను ప్రజలందరికీ చేరువ చేస్తానని ప్రముఖ సినీ దర్శకుడు వి.సముద్ర తెలిపారు. ఈ మేరకు క్రిష్ణమయ్యపై సినిమా తీయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఆదివారం పైడితల్లమ్మ మహోత్సవంలో తెలగ యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు సారథ్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రిష్ణమయ్య వచన సంకీర్తనల ద్వారా సింహాద్రినాథుని మెప్పుపొందడంతోపాటు నాటి సాంఘిక దురాచారాలపై పోరాటం చేసిన మహనీయుడు అన్నారు. ఆయన చరిత్ర ద్వారా సింహాద్రి అప్పన్న మహిమలను చాటిచెప్పేందుకు వీలుంటుందని, వెంకన్నకు అన్నమయ్య లా అప్పన్నకు క్రిష్ణమయ్య అంతటి వాడే నని చెప్పడమే ఉద్దేశమన్నారు. క్రిష్ణమయ్య జీవిత చరిత్ర, సంకీర్తనలు సమగ్రంగా పండితులు, గ్రంథాలయాల నుంచి సేకరించే పని ప్రారంభించామన్నారు. ఇందులో స్థానాచార్యులు డా.టీడీపీ రాజగోపాల్, తదితరులు సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

సమస్యల 'పాలవెల్లి'

పదేళ్లుగా అంధకారంలోనే కోనాం జలాశయం

- » రూ.40 లక్షలకు పైగా విద్యుత్ బకాయి
- » పని చేయని దిగువ కాలువల గేట్ల డోర్లు
- » 30 క్యూసెక్కుల నీరు లీకేజీ రూపంలో వృథా
- » సిబ్బంది కొరత.. నైట్ వాచ్‌మన్‌తో కాలయాపన
- » ఏటా ఎగువ కాలువ రైతులకు సాగునీటికి కటకట


బురదమయంగా ఉన్న కోనాం జలాశయం గట్టు


జలాశయం వద్ద విధులు నిర్వహిస్తున్న ఒకే ఒక ఉద్యోగి షేక్ రసూల్

చీడికాడ, జూన్ 19 : మండలంలోని కోనాంలో నిర్మించిన పాలవెల్లి జలాశయం గత పది సంవత్సరాలకు పైగా సమస్యలతో కొట్టుమిట్టాడు తోంది. చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, దేవరాపల్లి మండలాల్లో సుమారు 14 వేల 500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 1977-80లో దీన్ని నిర్మించారు. ఈ జలాశయానికి శిరిజాం, మర్లగుమ్మి, మంగళాపురం హైలెవెల్ చానల్ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ఈ చానల్‌కు సాగునీరు అందించేందుకు దిగువ


తుప్పల మధ్యలో ఉన్న విశ్రాంతి భవనం

కాలువకు మూడు గేట్లు, ఎగువ కాలువకు ఒక గేటు ఏర్పాటు చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా 92 మీటర్లు వచ్చేసరికి హైలెవెల్ కాలువకు సాగునీరు నిలిచిపోతుంది. అదే దిగువ మూడు ఆనకట్టలకు 87 మీటర్ల వరకూ సాగునీరు పారుతుంది. అయితే జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి ప్రతిరోజు 30 క్యూసెక్కులకు పైగా సాగునీరు వస్తున్నా దిగువ కాలువగేట్లు జోరు శిథిలావస్థలో ఉండటంతో ప్రతిరోజు 30 క్యూసెక్కులకు పైగా సాగునీరు వృథాగా లీకేజీ రూపంలో కాలువలోకి పోతోంది. జలాశయం నిర్మాణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సదుపాయం సజావుగా సాగుతున్నప్పటికీ, పదేళ్ల క్రితం వరకూ రూ.40 లక్షల వరకూ బిల్లులు కట్టకపోవడంతో ఆ వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో పదేళ్ల నుంచి జలాశయం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. వర్షాకాలం నాలుగు నెలలు జనరేటర్ సహాయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఈ జలాశయం వద్ద నీటి పారుదలశాఖ ఏఈ మినహా మరో ఎనిమిది మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం ఒక నైట్‌వాచ్‌మన్ మాత్రమే ఉన్నాడు. అతడు జలాశయం వద్దనే నివాసం ఉంటూ తప్పని పరిస్థితుల్లో రాత్రి, పగలు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నాడు. జలాశయం గరిష్ఠ స్థాయికి చేరినపుడల్లా నైట్‌వాచ్‌మన్ ఎన్నో ఇబ్బందులు పడుతుంటాడు. ఎగువ కాలువ గేట్లు నుంచి దిగువ కాలువ గేట్లు వరకూ


దిగువ ఉన్న కాలువ గేట్లు ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

జలాశయం ప్రధాన గట్టు మట్టిది కావడంతో ఓ మోస్తరు చినుకులు పడినా బురదకుంటలా తయారవుతుంది.

శిథిలావస్థలో సిబ్బంది క్వార్టర్స్

జలాశయం నిర్మాణంలో నియమించిన సిబ్బంది వసతిగృహాలు శిథిలావసకు చేరాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినపుడు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన భవనాన్ని సైతం పట్టించుకోకపోవడంతో తుప్పలు, డొంకల మధ్య శిథిలావస్థకు చేరుకుంది. ఈ సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేయడంతో సమస్యలు పేరుకుపోయాయని రైతులు, రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వంలో గెలిచిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై ఏఈ సీహెచ్ జయరామ్ వద్ద ప్రస్తావించగా.. గతంలో ఎన్నోసార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మరోసారి ఈ ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళతామని తెలిపారు.


పూర్తిగా శిథిలమైన సిబ్బంది వసతిగృహాలు

శిరీషకు రాష్ట్ర స్థాయి యువ శాస్త్రవేత్త అవార్డు


గవర్నర్ నజీర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శిరీష

దేవరాపల్లి, జూన్ 19 : మండలంలోని మారేపల్లికి చెందిన అవుగడ్డ శిరీష రాష్ట్ర స్థాయి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారంతో పాటు స్వర్ణ పతకం దక్కించుకుంది. బాపట్లలోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన 56వ స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్లా నజీర్ చేతుల మీదుగా, ఐకార్ (ఐసీఏఆర్)డైరక్టర్ జనరల్ (న్యూఢిల్లీ)డా.హిమన్షు పాటక్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారదా జయలక్ష్మి సమక్షంలో పురస్కారాన్ని ఆమె స్వీకరించారు. ఈమె ప్రస్తుతం ఎలమంచిలిలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు.

రెండో దశ వ్యవసాయ గణనపై శిక్షణ


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అర్థగణాంక శాఖ ఉప సంచాలకురాలు సౌజన్య

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 19: రెండో దశ వ్యవసాయ గణనను పారదర్శకంగా నిర్వహించాలని అర్థగణాంక శాఖ ఉప సంచాలకురాలు కె. సౌజన్య అధికారులను ఆదేశించారు. 2021, 2022 సంవత్సరాలను ప్రామాణికంగా తీసుకుని కమతాల వారీగా, పంటల వారీగా సాగు వివరాలు నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో దశ వ్యవసాయ గణనకు సంబంధించి జిల్లాస్థాయి శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ వ్యవసాయ గణనలో మండల సహాయ గణాంక అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. ముందుగా వ్యవసాయ గణనను నిర్వహించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక విభాగం అధికారి రామారావు, గణాంక అధికారి ఎం.శ్రీరామ్మూర్తి, సహాయ గణాంక అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం నిలవాలంటే పరుగు తీయాల్సిందే!!

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కింగ్‌జార్జి ఆస్పత్రి (కేజీహెచ్)లో రోగుల బాధలు అన్నీ ఇన్నీ కావు. దిగువ స్థాయి సిబ్బంది ప్రతి పనికీ లంచాలు ఆశించి, ఎవరైనా అడిగిన మొత్తం ఇవ్వకపోతే...విధుల నిర్వహణకు ముందుకు రారు. దాంతో చాలామంది రోగుల వెంట వచ్చేవారు తామే ఆ పనులు చేసుకుంటూ ఉంటారు. అర్జెంట్‌గా ఎవరైనా రోగిని ఒక వార్డు నుంచి మరో వార్డుకు తీసుకువెళ్లాలంటే వీల్ ఛైర్ లేదా స్ట్రెచర్ అవసరం అవుతాయి. వాటిని తీసుకువచ్చి, రోగిని తరలించేవారి చేతిలో ఎంతో కొంత పెట్టకపోతే వారు ఆ పనిచేయరు. డబ్బులు ఇవ్వలేని వారు తామే భుజాలపై వేసుకునో, వీల్ ఛైర్ తీసుకునో వెళతారు. అలాంటి ఘటనే ఒకటి మంగళవారం కేజీహెచ్‌లో జరిగింది. కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన శిరీష నెలలు నిండకుండానే కేజీహెచ్‌లో మంగళవారం ప్రసవించింది. బిడ్డ ఆరోగ్యం బాగా లేకపోవడంతో నియోనాటిల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించాలని వైద్యులు నిర్ణయించారు. అక్కడికి వెళ్లేంత వరకు బిడ్డకు ఆక్సిజన్ ఉండాలని, సిలిండర్ అమర్చారు. బిడ్డతో పాటు దానిని కూడా అక్కడికి తీసుకువెళ్లాల్సి ఉంది. సాయం చేసేవారు ఎవరూ లేకపోవడంతో బిడ్డ తండ్రి విష్ణుమూర్తి తానే ఆ సిలెండర్ మోసుకొని వస్తానని, వైద్యులకు చెప్పి బిడ్డతో పాటు వెళ్లాడు. దానిని కొందరు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బాగా వైరల్ అయింది. దాంతో ఉన్నతాధికారులు ఘటనపై ఆరా తీశారు. మరోసారి అలా జరగకుండా బ్యాటరీ వాహనాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు.

» కేజీహెచ్‌లో రోగుల పాట్లు


నర్సు వెనుక ఆక్సిజన్ సిలెండర్‌తో వెళుతున్న తండ్రి

తుమ్మపాలలో శిలాఫలకం ధ్వంసం

ఆందోళన చేపట్టిన వైసీపీ నాయకులు

తుమ్మపాల, జూన్ 19 : మండలంలోని తుమ్మపాలలో అభివృద్ధి పనులకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో వైసీపీ నాయకులు బుధవారం కొద్దిసేపు సదరు ప్రాంతంలో నిరసన తెలిపి పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు మాట్లాడుతూ తుమ్మపాల వీధిలో రూ. 11లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా, ఫిబ్రవరిలో అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణమని వాపోయారు. పోలీసులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు


ధ్వంసమైన శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఆస్తి పన్ను చెల్లింపునకు తంటాలు

- » వార్డు సచివాలయాల్లో పనిచేయని సీడీఎంఏ వెబ్‌సైట్
- » మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు వరకూ గడువు
- » ఆ తరువాత నెలకు నూటికి రూ.2 వడ్డీ విధింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సీడీఎంఏ వెబ్‌సైట్ చుక్కలు చూపిస్తోంది. వార్డు సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు వెళ్లిన వారికి సర్వర్ డౌన్ అంటూ అక్కడి సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా చేసేదేమీలేక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం నివాస, నివాసేతర భవనాలతోపాటు ఖాళీ స్థలాలకు సంబంధించి 5,72,356 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.450 కోట్లు పన్ను వసూలవుతుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.456 కోట్లు వసూలైంది. సాధారణంగా ఆస్తి పన్నును రెండు విడతలుగా (అర్ధ సంవత్సరాలు) విభజించి యజమానుల నుంచి జీవీఎంసీ కట్టించుకుంటుంది. ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకూ మొదటి అర్ధ సంవత్సరంగానూ, అక్టోబర్ ఒకటి నుంచి మార్చి 31 వరకూ రెండో అర్ధసంవత్సరంగా పరిగణిస్తారు. మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును జూన్ 30వ తేదీలోగా చెల్లించేయాల్సి ఉంటుంది. అలాకానిపక్షంలో రూ.2 చొప్పున వడ్డీ అదనంగా చెల్లించాలి. దీంతో చాలామంది పన్ను చెల్లింపుదారులు జూన్‌నెలలోనే తమ మొదటి అర్ధసంవత్సరం పన్నును చెల్లిస్తుంటారు. ఆస్తి పన్ను చెల్లింపు కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో 'సౌకర్యం' కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిల్లో పన్ను చెల్లిస్తే ఆ మొత్తం జీవీఎంసీ ఖజానాకు నేరుగా చేరిపోతుంది. ఇవికాకుండా జీవీఎంసీ పరిధిలోని 573 వార్డు సచివాలయాల్లో కూడా ఆస్తిపన్ను చెల్లించేందుకు గత రెండేళ్లుగా అవకాశం కల్పించారు. తమ ఇంటి సమీపంలోని వార్డు సచివాలయాల్లో ఎక్కువ మంది పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే వార్డు సచివాలయాల్లో జీవీఎంసీ వెబ్‌సైట్‌లో కాకుండా సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా పన్ను వసూలు జరుగుతుంది. గత మూడు రోజులుగా సీడీఎంఏ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో వార్డు సచివాలయాల్లో ఆస్తిపన్ను వసూళ్లు నిలిచిపోయాయి. పన్ను చెల్లింపుదారులు అక్కడకు వెళితే సర్వర్ డౌన్‌లో ఉన్నందున పన్ను కట్టించుకునే పరిస్థితి లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే వడ్డీ పడిపోతుందని, అది ఎవరు భరిస్తారని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

29న చోడవరంలో జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

విశాఖపట్నం (లీగల్), జూన్ 19 : చోడవరం కోర్టులో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ తెలిపారు. చోడవరం కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, రాజీకి యోగ్యత కలిగిన కేసులు, సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. గంజాయికి సంబంధించిన కేసుల ఆస్తులు కోర్టుకు చేరడంలేదని వీటి విచారణ వేగవంతం చేయాలని అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ భాస్కరన్‌కు సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిషన్ కమ్ సబ్‌జడ్జి ఇ.రాజేంద్ర మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో జాప్యం జరిగితే న్యాయవాదులు, కక్షిదారులు తనను నేరుగా కలవాలని సూచించారు. ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి జి.స్వర్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ తదితరులు మాట్లాడారు.

పది హెక్టార్లలో టేకు ప్లాంటేషన్ సాగు

» ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్


టేకు ప్లాంటేషన్ పనులు పరిశీలిస్తున్న ట్రైనీ డీఎఫ్‌వో రౌఫ్

గొలుగొండ, జూన్ 19 : అచ్చియ్యపేట వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న టేకు ప్లాంటేషన్‌లో చేపడుతున్న పనులను ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రౌఫ్ బుధవారం పరిశీలించారు. మండలంలోని పాతమల్లంపేట గ్రామపంచాయతీలో శివారు అచ్చియ్యపేటలో గల అటవీ ప్రాంతంలో సుమారు పది హెక్టార్లులో టేకు ప్లాంటేషన్ ఏర్పాటుకు తుప్పలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. దీన్ని నర్సీపట్నం ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రౌఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రౌఫ్ విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఏడాది పది హెక్టార్లులో టేకు ప్లాంటేషన్ నాటేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. త్వరితగతిన తుప్పలు తొలగించే కార్యక్రమం అటవీ సిబ్బంది చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెలాఖరులోగా టేకు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్, వెంకట్రావు, ఎఫ్‌బీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పంట కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి'

చీడికాడ, జూన్ 19 : రైతుల పొలాల్లో పంట కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధి పథకం వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట కాలువల నిర్మాణంలో ఇంతవరకూ ఆరుశాతం మాత్రమే పనులు చేశారని మిగతా పనులు కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నదృష్ట్యా ఈ ఏడాది పండ్లతోటల పెంపకానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని కోరారు.

'ఈవీఎంలపై జగన్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరం'

తుమ్మపాల, జూన్ 19 : ఈవీఎంల పనితీరుపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు బుధవారం ఇక్కడ విమర్శించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలు గొప్పగా పనిచేస్తున్నాయని చెప్పిన జగన్‌రెడ్డి, నేడు మాటమార్చడం అన్యాయమని పేర్కొన్నారు. గెలిచినప్పుడు ఒక మాట, ఓడినప్పుడు ఒక మాట హాస్యాస్పదమన్నారు. అర్థం పర్థం లేని వ్యాఖ్యలతో జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలైపోతున్నారన్నారు. గత ఐదేళ్లు కళ్లు మూసుకుని పరిపాలన సాగించిన జగన్‌రెడ్డి ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రశ్చాతాపం పడకుండా తప్పించుకునే ధోరణి తగదన్నారు. ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనని ఎద్దేవా చేశారు.

సాగునీటి కష్టాలు తీరేనా?

... 3వ పేజీ తరువాయి

మారిపోయింది. దీంతో ఎత్తులో ఉన్న మెయిన్ కెనాల్‌కు రైవాడ నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా గత పన్నెండేళ్ల నుంచి ఈ ప్రాంత రైతాంగం సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. భారీగా వర్షాలు వచ్చి శారదానదిలో నీటి ప్రవాహం పెరిగితే తప్ప, ఈ కాలువల్లోకి నీరు పారడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత రైతాంగం బోయిలకింతాడ నుంచి చానల్‌కు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ అధికారులకు విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా ఉంది. బోయిలకింతాడకు సమీపంలోని చోడవరం మండల పరిధిలోని గ్రామాలకు చెందిన గవరవరం, లక్కవరం తదితర గ్రామాలకు చెందిన కొందరు రైతులు ఏటా చందాలు వేసుకుని ఎక్స్‌కవేటర్లను అద్దెకు తెచ్చుకుని వాటితో శారదానదిలో పారే నీరుకు ఇసుకతో అడ్డుకట్టలు వేసి, నది నీరు కాలువలోకి వచ్చేలా పాట్లు పడుతున్నారు. ఏటా ఈ కాలువలకు సాగునీరు ఖర్చులు తడిసిమోపెడవుతుండడంతో, రైవాడ నీరు తమ చానల్ పరిధిలోని కాల్వలకు శాశ్వత ప్రాతిపదికన అందేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతాంగం విజ్ఞప్తి చేస్తున్నది. కానీ ఈ రైతుల వేదన అరణ్య రోదనగానే మిగిలిపోతుంది తప్పితే రైతాంగానికి సాగునీరు అందడం లేదు.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

... 3వ పేజీ తరువాయి

సరైన ఆహారం అందించడం లేదు. వారికి ఏది తయారుచేయడం సులువో చూసుకొని అది మాత్రమే పెడుతున్నారు. ఈ కాంట్రాక్టు వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలిసిన విషయమే కావడంతో కేజీహెచ్ పరిపాలనా అధికారులు పట్టించుకోవడం లేదు. కడుపు మండి ఎవరైనా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే...అది బుట్టదాఖలు అవుతున్నదే తప్ప చర్యలు ఉండడం లేదు.

ప్లేటులో వేస్తే చెదిరిపోయే ఉప్మా

రోగులకు ప్రతిరోజూ ఉదయం టిఫిన్ కింద ఇడ్లీ/ఉప్మా/కిచిడీ/బ్రెడ్‌లలో ఏదో ఒకటి, పాలు, గుడ్డు ఇవ్వాలి. అయితే ఇడ్లీలు తయారుచేసే యంత్రం పాడైపోయిందని అవి పెట్టడం మానేశారు. పోనీ ఆ స్థానంలో మంచి టిఫిన్ ఏదైనా ఇస్తున్నారా?...అంటే అదీ లేదు. గత పది రోజులుగా టిఫిన్ ప్లేటులో ఉప్మాయే పోస్తున్నారు. గరిటెతో తీసి ప్లేటులో వేయగానే అది ప్లేటు అంతా సాంబారులా పరుచుకుపోతోంది. దానిని ఉప్మా అంటారో...లేదా కొత్తగా ఏమైనా పేరు పెట్టాలో అర్థం కాదు. కిచిడీ కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఆహారం ఎంత బరువుతో ఇవ్వాలో లెక్కలు ఉన్నాయి. వాటిని పాటించే దిక్కేలేదు. మధ్యాహ్న భోజనం కింద అన్నం, సాంబారు, పప్పు, కూర, మజ్జిగ, అరటి పండు, గుడ్డు ఇవ్వాలి. రాత్రికి మజ్జిగ, అరటిపండు తీసేసి మిగిలినవన్నీ ఇవ్వాలి. ఎవరైనా రోగులు పుల్కాలు, రోటీ అడిగితే పెట్టాలి. మూడు పూటలూ గుడ్డు అందించాలి. ఈ భోజనంలో కూరలు, పప్పు గురించి చెప్పనక్కర్లేదు. రుచి అంతంతమాత్రమే. ఆ ఆహారం రోగులకు సాయంగా ఉండేవారు తిని, బయట నుంచి మంచి ఆహారం తీసుకువచ్చి రోగులకు పెడుతున్నారు.

వైసీపీ హయాంలో 'తుమ్మపాల'లో అరాచకాలు

» మూతపడిన ఫ్యాక్టరీ నుంచి భారీగా వస్తు సామగ్రి చోరీ » తక్షణమే విచారణ జరిపించండి » రైతు సంఘం ప్రతినిధుల డిమాండ్


ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తుమ్మపాల, జూన్ 19 : తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న అరాచకాలపై తక్షణమే విచారణ చేపట్టాలని రైతు సంఘం నాయకుడు కర్రి బాబి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ నాయకులతో కలిసి బుధవారం ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన ఫ్యాక్టరీ నుంచి భారీగా వస్తు సామగ్రి చోరీకి గురైందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. పర్మినెంట్ కార్మికులు విధుల్లో ఉన్నప్పటికీ లక్షలాది రూపాయల సామగ్రి తరలిపోవడం దారుణమని వాపోయారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. అలాగే ఎన్ఎంఆర్ కార్మికు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. నాయకులు చదరం నాగేశ్వరరావు, పీలా విశ్వేశ్వరరావు, గొర్లి మోదినాయుడు, పీలా సీతా రాం, పీలా తాతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం


స్వామి, అమ్మవారి కల్యాణం జరుపుతున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూన్ 19 : ఇక్కడి గవరపాలెం సతకంపట్టు వద్ద గల కనకదుర్గమ్మ ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉదయం ప్రముఖ బిల్డర్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు పసుపు కుంకుమలను సమర్పించారు. అనంతరం అర్చకులు దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు సాంప్రదాయ బద్ధంగా మంగళస్నానాలను చేయించారు. రాత్రి వేదపడింతుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని అంగరంగవైభవంగా చేపట్టారు. కల్యాణోత్సవంలో భీశెట్టి సంతోష్, కోమలి, పొలమరశెట్టి వెంకట సూర్యనారాయణ, దివ్య దంపతులు కూర్చొన్నారు. ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు వీవీ రమణ, ఆలయ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరుల కమిటీ, మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొక్కు చెల్లించుకున్న చలపతిరావు


తిరుమలలో తలనీలాలు సమర్పించిన చలపతిరావు

ఎలమంచిలి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు టీడీపీ నాయకులతో కలిసి తిరుపతి వెళ్లి స్వామివారికి మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆయన స్వామికి మొక్కుకున్నారు. ఆ ప్రకారం చంద్రబాబు విజయం సాధించడంతో ఎలమంచిలి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జిల్లా కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బొద్దపు శ్రీను, కరణం రవి తదితరులతో వెళ్లి స్వామివారికి తలనీలాలు సమర్పించామని తెలిపారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

కశింకోట, జూన్ 19 : ఇక్కడి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలన్నింటిలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ కలగ లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, టీడీపీ నాయకులు కాయల మురళీధర్, టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.

రాంబిల్లి : మురకాడ, గోకివాడ, కట్టుబోలు, దిమిలి, మామిడివాడ రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం సబ్సిడీపై రైతులకు వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. మండల వ్యవసాయాధికారిణి సుమత, కూటమి నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ధూళి రంగనాయకులుతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. బుధవారం మునగపాకలో పలువురు నాయకులతో కలిసి విత్తనాల పంపిణీ చేపట్టి మాట్లాడారు. ఎంపీపీ జయలక్ష్మి, ఏఈవో లక్ష్మి, నాయకులు దొడ్డి శ్రీను, దాడి మునిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పరవాడలో దుర్గామాంబ పండగ



పరవాడ, జూన్ 19 : మండల కేంద్రం పరవాడలో గురువారం దుర్గామాంబ పండగ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకుజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయని ఆలయ ధర్మకర్త పైలా పోతునాయుడు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

మారేడుపూడిలో మరిడిమాంబ వేడుక

అనకాపల్లి రూరల్, జూన్ 19 : మారేడుపూడిలో మరిడిమాంబ పండగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంతో పాటు గ్రామంలోని పలు వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

పి.బోనంగిలో ఉపాధి పనుల కోసం వినతి

పరవాడ, జూన్ 19 : పి.బోనంగిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని సర్పంచ్ బండారు కల్పన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో కీర్తి స్పందనను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గత ఏడాది కాలంగా ఉపాధి పనులు చేపట్టలేదని దీనివల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నక్కపల్లి, జూన్ 19 : చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఉదయం యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. హెచ్ఎం కవిత, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు యేడిద వెంకట రమణ, పీడీ ఆదిలక్ష్మి ఈ తరగతులను ప్రారంభించారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ట్రైనర్ డి.రాంబాబు పిల్లలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

బండారుకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు


బండారుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజు తదితరులు

సబ్బవరం, జూన్ 19 : మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదినం సందర్భంగా బుధవారం ఆయనను పలువురు టీడీపీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు, కోరాడ శ్రీనివాసరావు, బలిరెడ్డి రాములతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

» పూడిమడకలో పెచ్చులూడి పడిన ఇంటి శ్లాబ్
» అంతవరకు ఇంట్లోనే ఉండి అప్పుడే బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు
» కళ్లెదుట ఘటన చూసి భయాందోళన


ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు



అచ్యుతాపురం రూరల్, జూన్ 19 : మండలంలోని పూడిమడక గ్రామంలో ఓ కుటుంబ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడింది. మేరుగు రాజుకు చెందిన కుటుంబ సభ్యులు ఎనిమిది మంది మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించారు. బుధవారం ఉదయం లేచి ఎవరి పనుల్లో వారు బయట బిజీగా ఉన్నారు. సరిగ్గా 6.30గంటల సమయంలో ఇంట్లో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. అంతా ఆందోళనతో చూసేసరికి ఇంటి శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతుండడం ఆరంభమైంది. ఒక్కొక్కటిగా పెచ్చులు కింద పడుతుండడంతో ఒక్కసారిగా షాక్ గురయ్యారు. ఇంట్లోని సామగ్రి ధ్వంసమయ్యాయి. అంతవరకు తామంతా ఇంట్లోనే ఉన్నామని, ఆ సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే తమ పరిస్థితి ఏమిటని వాపోయారు.

'మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థం'

సబ్బవరం, జూన్ 19 : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల దుష్ప్రభావాలు తీవ్రంగా ఉంటాయని సెబ్ సీఐ పి.దుర్గాప్రసాద్ అన్నారు. ఇక్కడి మదర్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఏర్పాటై అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశ భవిష్యత్తును విద్యార్థులు, యువత దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

అనకాపల్లి రూరల్, జూన్ 19 : గొలగాం పంచాయతీ శివారు కొత్త తలారివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. మాజీ సర్పంచ్ చీకటి రాంబాబు, టీడీపీ నాయకుడు తలారి కాశీనాయుడు పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. టీడీపీ నాయకులు నారిపిన్ని మాధవరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి సీపీఎం నాయకులు సంతాపం

ఎస్.రాయవరం, జూన్ 19 : ఇటీవల మృతిచెందిన వీఆర్ఏ, మండల గ్రామ సహాయకుల సంఘం అధ్యక్షుడు చింతాడ అప్పారావు కుటుంబాన్ని పలువురు సీపీఎం నాయకులు బుధవారం పరామర్శించారు. లింగరాజుపాలెంలో గల ఆయన ఇంటికి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు వెళ్లి సంతాపాన్ని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, వీఆర్ఏల సంఘం జిల్లా నాయకుడు కోరిబిల్లి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సంత మార్కెట్‌లో రెండు పాకలు దగ్ధం

అచ్యుతాపురం రూరల్, జూన్ 19 : మండల కేంద్రం అచ్యుతాపురం సంత మార్కెట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పాకలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంకినాయుడు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

రాంబిల్లి, జూన్ 19 : సమరతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాంబిల్లిలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి ఆయన పోరాట పటిమను కీర్తించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సూరాడ నూకరాజు, కొల్లి అప్పారావు, వాడనర్సాపురం సర్పంచ్ కారే రామారావు, కో-ఆప్షన్ సభ్యులు చింతకాయల పెంటయ్య, కారే రాముడు తదితరులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లలను బడిలోకి చేర్పించాలి'

తుమ్మపాల, జూన్ 19 : బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని ఎంపీడీవో మురళీమోహన్ కుమార్ సూచించారు. 'బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు సంవత్సరాల నుంచి పద్నాలుగు సంవత్సరాలలోపు పిల్లలంతా బడుల్లో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, సీడీపీవో శశికళ పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ


వ్యాధి లక్షణాలను వివరిస్తున్న వైద్యాధికారిణి శక్తిప్రియ

ఎస్.రాయవరం, జూన్ 19 : సికిల్ సెల్ ఎనీమియా రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా అవేర్నెస్ డేను బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎస్ఎస్‌వీ ప్రకాష్, దాసరి రామలక్ష్మి, పీఎస్‌వీపీఎస్ ప్రసాద్, జి.బేబిలతో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తుమ్మపాల : సికిల్ సెల్ ఎనీమియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ పేర్కొన్నారు. బుధవారం ఈ వాధిపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి మాట్లాడారు. రక్తహీనత, కళ్లు పసుపురంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట తదితర లక్షణాలు ఈ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. వ్యాధిబారిన పడిన వారు తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది బి.సంగం, ఎం మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

సబ్బవరం, జూన్ 19 : పరవాడ మండలం పెద ముషిడివాడలో బుధవారం మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న మహిళలను అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

దడ పుట్టించే దారి

... 3వ పేజీ తరువాయి

కోర్టు సముదాయం, కూరగాయల మార్కెట్ ఉంది. కూరగాయల మార్కెట్‌కు శని, మంగళ, గురువారాలలో నర్సీపట్నం నుంచి వందలాది మంది వస్తుంటారు. కోర్టు పని మీద వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు ఈ గోతుల రహదారిలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ కార్యాలయం నుంచి పాత కల్పనా థియేటర్ వరకు రెండు చోట్ల పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయించలేదు. నర్సీపట్నం- చింతపల్లి మెయిన్ రోడ్డులో ఆర్ అండ్ బీ కార్యాలయం నుంచి ఒక కిలో మీటరు పొడవున రోడ్డు అభివృద్ధికి నాలుగేళ్ల క్రితం రూ2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ సమస్యపై ఆర్ అండ్ బీ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


అనకాపల్లి గాంధీనగరంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు


పాయకరావుపేటలో జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో...

అనకాపల్లి టౌన్, జూన్ 19 : దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ అన్నారు. బుధవారం గాంధీనగరంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జన్మదిన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ దేశానికి కాబోయే ప్రధానమంత్రి రాహుల్‌గాంధీ అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నాయకులు దాసరి సంతోష్, దాడి పరమేశ్వరరావు, కొల్లి సత్యారావు, ఇందుర్తి గౌరీ, ఏడువాకల దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బోయిన భానుమూర్తియాదవ్ ఆధ్వర్యంలో పేదలకు, రిక్షా కార్మికులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తెర శ్రీధర్, తుట్టా రమణ, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగవరం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలవరపు అప్పలరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితకు శుభాకాంక్షల వెల్లువ


అమరావతిలో అనితను కలిసిన తోట నగేష్, గెడ్డం బుజ్జి తదితరులు


అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట/ పాయకరావుపేట రూరల్/నక్కపల్లి/ఎస్.రాయవరం, కోటవురట్ల, జూన్ 19 : అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం హోం మంత్రిగా వంగలపూడి అనిత పదవీ బాధ్యతలు చేపట్టడంతో నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో కూటమి శ్రేణులు సంబరాలు జరపుకున్నారు. అమరావతిలో ఈ వేడుకను తిలకించేందుకు ఇక్కడి నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, యేజెర్ల వినోద్‌రాజు, లాలం కాశీనాయుడు తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు తోట నగేష్, గెడ్డం బుజ్జి, టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, దేవవరపు రాజు బాబు, గొర్లె రాజుబాబు, బొంది కాశీవిశ్వనాథ్, చిక్కాల శ్రీను, ఎం.రమాకుమారి, మజ్జూరి నారాయణరావు, విలియం కేరీ, దేవవరపు ఆనంద్, ఎన్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావు, గోరంట్ల ఆశా, సుంకర్‌బాబ్జి, యలమంచిలి ప్రకాష్, కె.వెంకటాపురం, తిరుమలరావు, జనసేన నాయకులు బోడపాటి శివదత్, నానాజీ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తదితరులు మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జనసేన మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న ఆధ్వ ర్యంలో సంబరాలు నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జనసైనికులు, పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్‌కట్ చేశారు. నాయకులు బుదిరెడ్డి మోహన్, వేగి కోటి, దాడి నాగరాజు, చిన్ని జనార్ధన్, సిదిరెడ్డి శ్రీను, తాకాశి కృష్ణ, పెంటకోట రాము, పి.సంతోష్, ఎం.మోహన్, రాజారావు తదితర కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన 'దాడి


అయ్యన్నతో ముచ్చటిస్తున్న దాడి వీరభద్రరావు

నర్సీపట్నం, జూన్ 19 : అనకాపల్లికి చెందిన పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడును కలిశారు. బుధవారం శివపురంలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ దాడి వీరభద్రరావు, బీసీ సాధికారికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర తదితరులు అయ్యన్నపాత్రుడుకి శాలువా కప్పి సన్మానించారు. అసెంబ్లీ స్పీకర్‌గా త్వరలో బాధ్యతలు స్వీకరించబోతున్న ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోలవరపు త్రినాథ్, బొడ్డపు ప్రసాద్, గొల్లవల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

▸▸ అధికారులకు ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు ఆదేశం


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు

చోడవరం, జూన్ 19 : పట్టణంలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రేమసమాజం వీధి, శివాలయం వీధి, చందకవీధి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ప్రేమసమాజం వీధిలోని పంచాయతీ స్థలాల్లో ఉంటున్న ఇంటి హక్కు కల్పించేలా పన్ను విధించాలని పంచాయతీ ఈవో నారాయణరావుకు సూచించారు. అలాగే వీధిలో కాలువలు, రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శివాలయం వీధిలోని లోవోల్టేజి సమస్యలతో ఇబ్బందిపడుతున్నట్టు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ఈపీడీసీఎల్ ఏఈ రాజును పిలిచి ఆ ప్రాంతంలో అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. చందకవీధిలోని సమస్యలపైనా స్థానికులు ఎమ్మెల్యేకు వివరించగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో పంచాయతీ వార్డు సభ్యులు శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ


దొండపూడిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ లక్ష్మి

రావికమతం, జూన్ 19 : వ్యవసాయానికి ప్రాధాన్యత ఒక్క సీఎం చంద్రబాబుకే సాధ్యమని దొండపూడి ఎంపీటీసీ కొప్పాక లక్ష్మి అన్నారు. బుధవారం ఆమె ఆర్బీకే ద్వారా రైతులకు వరి విత్తనాల పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయంలో రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు. దొండపూడి ఆర్బీకే ద్వారా ఈ ఖరీఫ్‌కు 149 క్వింటాల వరి విత్తనాలు అవసరంగా ప్రతిపాదనలు పంపగా, 97 క్వింటాలు మొదటి విడతగా వచ్చాయని ఎంపీఈవో కె.జగదీష్ తెలిపారు. వీటిలో ఆర్‌జేఎల్, 1064 రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్వర్ణ, సాంబమసూరి రకాలు త్వరలోనే వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ బంటు రామునాయుడు,వెదురు పర్తి వెంకటాచారి, వడ్డాది శ్రీను పాతాళ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అలాగే మేజరు పంచాయతీ కొత్తకోటలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, శంకరావు తదితరులు రైతులకు వరి విత్తనాలు అందజేశారు.


కొత్తకోటలో విత్తనాల పంపిణీ

రాళ్లు తేలిన రహదారులు

▸▸ ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని నాతవరం రోడ్లు ▸▸ వినతులకు స్పందించని అధికారులు

నాతవరం, జూన్ 19 : నాతవరంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యకు ఏళ్ల తరబడి పరిష్కారం చూపకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

మండల కేంద్రం నాతవరం మెయిన్‌రోడ్డులో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అయితే ఈ ప్రధాన రహదారి పెద్దపెద్ద గోతులతో నిండిపోయింది. ఈ రోడ్డు నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకే ఆర్ అండ్ బీ పరిధిలోకి వస్తుందని, మిగతా రోడ్డు తాండవ ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇలా చెబుతూనే రహదారి మరమ్మతుకు మాత్రం ఎవరూ చేపట్టడం లేదు. దీంతో ప్రజలు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. తాండవ నీటిపారుదల అధికారులు నిధులు లేవంటూ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రెండు శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో నాతవరం మెయిన్ రోడ్డు దారుణంగా తయారైంది.

అలాగే తాండవ రోడ్డు కూడా 'అడుగుకు ఒక గొయ్యి' చందంగా తయారైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ఐదేళ్లలో జనసేన, టీడీపీ నాయకులు సొంత నిధులతో తాత్కాలికంగా గోతులు కప్పిన పరిస్థితి మరలా మొదటికే వచ్చింది. తాండవ రోడ్డులో ఆడాకుల, చమ్మచింత, మాధవనగరం, కురువాడ తదితర గ్రామాల ప్రజలు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. అయినా అధికారులు మరమ్మత్తులు చేపట్టడం లేదని వీరు అంటున్నారు. అలాగే


అధ్వానంగా ఉన్న నాతవరం మెయిన్‌రోడ్డు

సరుగుడు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్లు మంజూరు చేసినా అర్థాంతరంగా పనులు నిలిపి వేశారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే సరుగుడు, సుందరకోట, ఆసనగిరి దద్దుగుల, మాసంపల్లి రామన్నపాలెం, అచ్చెంపేట తదితర గిరిజన గ్రామాల ప్రజలు రోజూ నానావస్థలు పడుతున్నారు. అలాగే వెదురుపల్లి-గొలుగొండపేట తారురోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడు తున్నారు. ఒకప్పుడు వెదురుపల్లికి ఆర్టీసీ బస్సు వచ్చేదని, ఇప్పుడు రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ బస్సు సర్వీసు రద్దు చేశారని తెలిపారు.


ఇదీ తాండవ రోడ్డు పరిస్థితి..

ఇప్పటికైనా అధికారులు స్పందించి నాతవరం మండలంలో పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే 'బండారు' జన్మదిన వేడుకలు


మాడుగులలో కేక్ కట్ చేస్తున్న బండారు సత్యనారాయణ


కె.సంతపాలెంలో ఎమ్మెల్యే బండారుకు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

మాడుగుల, జూన్ 19 : మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన వేడుకలను బుధవారం మాడుగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బండారుతో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అక్కడకు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : కె.కోటపాడు మండలం కె.సంతపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివచ్చి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, పీవీజీ కుమార్, కె.కోటపాడు మాజీ సర్పంచ్ డోకల నరసింహమూర్తి, కె.కోటపాడు మండల టీడీపీ ప్రెసిడెంట్ రొంగలి మహేష్, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, బత్తి రమణ, కన్నూరు సూరిబాబు, వెలగల జగదీష్, బోజంకి సూర్యనారాయణ,కె.కోటపాడు మాజీ సర్పంచ్ డోకల నరసింహమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అప్పికొండమ్మ పండుగ

కృష్ణాదేవిపేట, జూన్ 19 : కృష్ణాదేవిపేటలో గురువారం గ్రామదేవత అప్పికొండమ్మ పండగ గ్రామస్థులు అత్యంతవైభవంగా నిర్వహించనున్నారు.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

... 3వ పేజీ తరువాయి

సరైన ఆహారం అందించడం లేదు. వారికి ఏది తయారుచేయడం సులువో చూసుకొని అది మాత్రమే పెడుతున్నారు. ఈ కాంట్రాక్టు వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలిసిన విషయమే కావడంతో కేజీహెచ్ పరిపాలనా అధికారులు పట్టించుకోవడం లేదు. కడుపు మండి ఎవరైనా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే...అది బుట్టదాఖలు అవుతున్నదే తప్ప చర్యలు ఉండడం లేదు.

ప్లేటులో వేస్తే చెదిరిపోయే ఉప్మా

రోగులకు ప్రతిరోజూ ఉదయం టిఫిన్ కింద ఇడ్లీ/ఉప్మా/కిచిడీ/బ్రెడ్‌లలో ఏదో ఒకటి, పాలు, గుడ్డు ఇవ్వాలి. అయితే ఇడ్లీలు తయారుచేసే యంత్రం పాడైపోయిందని అవి పెట్టడం మానేశారు. పోనీ ఆ స్థానంలో మంచి టిఫిన్ ఏదైనా ఇస్తున్నారా?...అంటే అదీ లేదు. గత పది రోజులుగా టిఫిన్ ప్లేటులో ఉప్మాయే పోస్తున్నారు. గరిటెతో తీసి ప్లేటులో వేయగానే అది ప్లేటు అంతా సాంబారులా పరుచుకుపోతోంది. దానిని ఉప్మా అంటారో...లేదా కొత్తగా ఏమైనా పేరు పెట్టాలో అర్థం కాదు. కిచిడీ కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఆహారం ఎంత బరువుతో ఇవ్వాలో లెక్కలు ఉన్నాయి. వాటిని పాటించే దిక్కే లేదు.

మధ్యాహ్న భోజనం కింద అన్నం, సాంబారు, పప్పు, కూర, మజ్జిగ, అరటిపండు, గుడ్డు ఇవ్వాలి. రాత్రికి మజ్జిగ, అరటిపండు తీసేసి మిగిలినవన్నీ ఇవ్వాలి. ఎవరైనా రోగులు పుల్కాలు, రోటీ అడిగితే పెట్టాలి. మూడు పూటలూ గుడ్డు అందించాలి. ఈ భోజనంలో కూరలు, పప్పు గురించి చెప్పనక్కర్లేదు. రుచి అంతంతమాత్రమే. ఆ ఆహారం రోగులకు సాయంగా ఉండేవారు తిని, బయట నుంచి మంచి ఆహారం తీసుకువచ్చి రోగులకు పెడుతున్నారు. ఈ విషయాలన్నీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

వారం నుంచి ఉప్మాయే

- మధు, సీతంపేట



మా అమ్మాయికి ఆరోగ్యం బాగా లేదని వారం క్రితం తీసుకువచ్చి చేర్పించాం. గైనిక్ వార్డులో చికిత్స చేస్తున్నారు. వారం నుంచి టిఫిన్ కింద రోజూ జావలాంటి ఉప్మా ఇస్తున్నారు. గట్టిగా అడిగితే పంపించేస్తారని ఏమీ అనలేకపోతున్నాం.

కృష్ణాదేవిపేటలో భారీ వర్షం

కృష్ణాదేవిపేట, జూన్ 19 : గొలుగొండ మండలంలో పలుగ్రామాల్లో ఈదురు గాలులతో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో రోడ్డు జలమయం అయింది. కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ వర్షపునీటితో చెరువును తలపించింది.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఏఎల్‌పురం డ్రెనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో వర్షంనీరు రోడ్డుపై నుంచి ఇళ్లలోకి చేరింది. ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. వర్షం కారణంగా విద్యుత్ గంటలు తరబడి అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అయిదు పశువుల పాకలు దగ్ధం

నాతవరం, జూన్ 19 : మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒకేసారి అయిదు పశువుల పాకలు దగ్ధం చేశారు. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. నాతవరంలో కొందరు గంజాయి తాగే కుర్రోళ్ళే ఈ పశువుల పాకలు దగ్గం చేసి ఉంటారని రైతులు అనుమానిస్తున్నారు. బుధవారం బాధిత రైతులు చింతకాయల సత్తిబాబు, ముళ్ళ అమ్మన్న తంబే సూరిబాబు, సామర్ల అప్పారావు, కర్రి పుష్ప నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాగునీటి కష్టాలు తీరేనా?

... 3వ పేజీ తరువాయి

మారిపోయింది. దీంతోఎత్తులో ఉన్న మెయిన్ కెనాల్‌కు రైవాడ నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా గత పన్నెండేళ్ల నుంచి ఈ ప్రాంత రైతాంగం సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. భారీగా వర్షాలు వచ్చి శారదానదిలో నీటి ప్రవాహం పెరిగితే తప్ప, ఈ కాలువల్లోకి నీరు పారడం లేదు. ఈ నేపథ్యంలోఈ ప్రాంత రైతాంగం బోయిలకింతాడ నుంచి చానల్స్‌కు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ అధికారులకు విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా ఉంది. బోయిలకింతాడకు సమీపంలోని చోడవరం మండల పరిధిలోని గ్రామాలకు చెందిన గవరవరం, లక్కవరం తదితర గ్రామాలకు చెందిన కొందరు రైతులు ఏటా చందాలు వేసుకుని ఎక్స్‌కవేటర్లను అద్దెకు తెచ్చుకుని వాటితో శారదానదిలో పారే నీరుకు ఇసుకతో అడ్డుకట్టలు వేసి, నది నీరు కాలువలోకి వచ్చేలా పాట్లు పడుతున్నారు. ఏటా ఈ కాలువలకు సాగునీరు ఖర్చులు తడిసిమోపెడవుతుండడంతో, రైవాడ నీరు తమ చానల్స్ పరిధిలోని కాల్వలకు శాశ్వత ప్రాతిపదికన అందేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతాంగం విజ్ఞప్తి చేస్తున్నది. కానీ ఈ రైతుల వేదన అరణ్య రోదనగానే మిగిలిపోతుంది తప్పితే రైతాంగానికి సాగునీరు అందడం లేదు.


రైవాడ నీటి కోసం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

దడ పుట్టించే దారి

... 3వ పేజీ తరువాయి

కోర్టు సముదాయం, కూరగాయల మార్కెట్ ఉంది. కూరగాయల మార్కెట్‌కు శని, మంగళ, గురువారాలలో నర్సీపట్నం నుంచి వందలాది మంది వస్తుంటారు. కోర్టు పని మీద వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు ఈ గోతుల రహదారిలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ కార్యాలయం నుంచి పాత కల్పనా థియేటర్ వరకు రెండు చోట్ల పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఐదేళ్లుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయించలేదు. నర్సీపట్నం-చింతపల్లి మెయిన్ రోడ్డులో ఆర్ అండ్ బీ కార్యాలయం నుంచి ఒక కిలో మీటరు పొడవున రోడ్డు అభివృద్ధికి నాలుగేళ్ల క్రితం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ సమస్యపై ఆర్ అండ్ బీ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

▸▸ సీనియర్ సివిల్ జడ్జి పట్టాన్ ఫియాజ్ ఖాన్


మాట్లాడుతున్న జస్టిస్ ఫియాజ్ ఖాన్

నర్సీపట్నం, జూన్ 19 : ఈ నెల 29 తేదీన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి పట్టాన్ ఫియాజ్ ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం కోర్టు సముదాయంలో నర్సీపట్నం టౌన్, రూరల్, గొలుగొండ, కృష్ణాదేవిపేట, నాతవరం, మాకరపాలెం, కోటవురట్ల, రోలుగుంట ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. రాజీ పడదగిన కేసులలో కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ అదాలత్ పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజీ పడే అవకాశం ఉన్న కేసు లను కౌన్సెలింగ్ నిర్వహించి కేసు ఉపసం హరణకు చర్యలు తీసుకోవాలని సూచించా రు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తి చేస్తే ప్రజలు సంతోషిస్తారు

▸▸ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్



నర్సీపట్నం, జూన్ 19 : అయ్యన్నపాత్రుడు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తే పట్టణ ప్రజలు సంతోషిస్తారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అన్నారు. బుధవారం ఆయన పెదబొడ్డేపల్లి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ గణేశ్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ప్రధాన రహదారి విస్తరణ పనులకు రూ.10.6 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఒక మోడల్‌గా చూపించాలని అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. అయ్యన్నపాత్రుడు మిగిలిన పనులు పూర్తి చేస్తే ప్రజలు సంతోషిస్తారని పేర్కొన్నారు.

దేశానికి రాహుల్‌గాంధీ సారథ్యం తథ్యం : జగత

చోడవరం, జూన్ 19 : భారతదేశానికి రాహుల్ గాంధీ సారథ్యం అవసరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగత శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని గాంధీగ్రామం పంచాయతీలో రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మోడీ అస్తవ్యస్త పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, దేశంలో ఇండియా కూటమికి అత్యధికంగా సీట్లు రావడమే రాహుల్ సారథ్యంపై పెరిగిన నమ్మకానికి నిదర్శనమన్నారు.

రైతులకు ఎరువుల అందజేత


రైతులకు ఎరువులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

చీడికాడ, జూన్ 19 : రైతులకు ఎంత కావాలిస్తే అంత కాంప్లెక్స్ ఎరువులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అర్జునగిరి సర్పంచ్ బి.రమాదేవి, ఎంపీటీసీ పెంటకోట అమ్మతల్లినాయుడులు అన్నారు. అర్జునగిరి రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు యూరియా బస్తాలను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాజిమొగ్గల ప్రసాద్, కసిరెడ్డి గణపతి, కొల్లి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు సూరిబాబు, వ్యవసాయసిబ్బంది దేవి, పాల్గొన్నారు.

డ్రాపవుట్స్ లేకుండా చూడాలి

మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కె.కోటపాడు, జూన్ 19 : 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా కె.కోటపాడు మండలంలో గల ఏ.కోడూరులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, తల్లిదండ్రులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు గల పిల్లలందరూ బడిలోనే కొనసాగాలని, డ్రాప్ అవుట్స్ ఉండరాదని, అందరి పిల్లలు బడికి హాజరు కావాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి హ్యాబిటేషన్‌లో డ్రాప్ అవుట్స్ జాయిన్ చేసి డ్రాపౌట్ రహిత గ్రామంగా ప్రకటించాలని ఇందుకు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ కోడూరు ఇన్‌చార్జి హెచ్‌ఎంబీ ప్రసాద్, ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ రెస్టారెంట్‌లో మద్యం తాగడంపై ఫిర్యాదు

రోలుగుంట, జూన్ 19 : స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు సమీపంలో ఉన్న ఓ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో కొందరు మద్యం తాగడం, తరచూ ఘర్షణలకు దిగడం చేస్తున్నారంటూ బనికెల సురేష్ కుమార్, రుత్తల నూకరాజులు ఎస్సై సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఫ్యామిలీ రెస్టారెంట్ అని బోర్డు పెట్టి నిత్యం సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు నిర్వాహకులు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. దీంతో ఎస్సై సురేష్ సిబ్బందితో రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు.

ఇద్దరి అరెస్టు : చోరీ సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలనాయుడు

రావికమతం, జూన్ 19 : చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

ఈ నెల 12 రాత్రి రావికమతం మండలం తట్టబంద పంచాయతీ శివారు ఎల్‌ఎన్ పురం గ్రామానికి చెందిన బోడిబాల అర్జున్‌రావు ఇంట్లో దొంగలు పడి సుమారు మూడు తులాల బంగారం, 27 తులాల వెండి,4 సెల్‌ఫోన్లు, రెండు పవర్‌బ్యాంక్‌లు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇదే మండలానికి చెందిన కొత్తకోట గ్రామానికి ఎద్దు రాజు (యేసు), శ్రావణ్‌కుమార్, మణికంఠ చోరీ చేస్తు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మణికంఠ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. నిందితులు ఎద్దు రాజు, శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన రావికమతం ఎస్ఐ ధనుంజయ నాయుడు, మేడివాడ ఎస్ఐ ధనుంజయనాయుడు, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.